# అభ్యుదయం

The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263

ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ  శుక్రవారం 02-10- 2026  సంపుటి : 6  సంచిక : 232  ఎడిటర్ : ఆనంద్ రావు  పేజీలు : 8  వెల : 3-00


## సర్ ప్రక్రియ పొడిగింపు లేదు



- 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చాం
- సర్‌లో ఈసీ కొన్ని మార్పులు చేసింది
- ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడి

మిగతా 2లో

## 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు

### కెప్టెన్ స్మిత్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 01(ఆర్ఎన్ఏ): ఫైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది వేడుకల్లో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. '

2లో





## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?



మిగతా 2లో

- తప్పు తేలితే శిక్షకు సిద్ధం.. నువ్వు సిద్ధమా..!?
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు రెడీ
- సిఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిద్ధమా?
- రేవంత్ ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్
- రాష్ట్రంలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు
- ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయారా!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదారాబాద్, **అభ్యుదయం** తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు.

## ఫారం- 6లో మార్పులకు ఎవరు ఆదేశించారు?

- సర్ ప్రక్రియతో ప్రజాస్వామ్యం పూర్తిగా ధ్వంసం
- సీఈసీ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలి
- మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్ పై విచారణ జరపాలి
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్
- ఈసీపై మరోసారి రాహుల్ గాంధీ ప్రశ్నల వర్షం
- నేటినుండి సర్‌పై ఇండియా కూటమి ఆందోళనలు



న్యూఢిల్లీ, **అభ్యుదయం:** అసలు ఫామ్ 6లో మార్పులకు ఆదేశాలు ఎవరి నుంచి వెళ్లాయి, ఎవరు వీటిని ఆమోదించారు, ఇందులో సాఫ్ట్ వేర్ నిర్వహిస్తున్న టీసీఎస్ పాత్ర ఎంత అన్న అంశాలు కూడా తెరపైకి వస్తున్నాయి. వీటిపై ఇవాళ విపక్ష నేత రాహుల్ గాంధీ ఈసీతో పాటు టీసీఎస్ ను కూడా ప్రశ్నిస్తూ ఓ ట్వీట్ చేశారు. ఇందులో ఫామ్ 6లో చేసిన మార్పులకు ఎవరి నుంచి ఆదేశాలు వెళ్లాయి, వాటిని ఎవరు ఆమోదించారంటూ ప్రశ్నించారు. అలాగే టీసీఎస్ లో ఈ మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఆన్‌లైన్ 'ఫారం 6' చట్టవిరుద్ధంగా మార్చారని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని స్వయంగా ఎన్నికల సంఘంలో కమిషనర్లే అభ్యంతరంగా నమోదు చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఆ మార్పులు చేయమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారని ఆయన ప్రశ్నించారు. టీసీఎస్ లో ఎవరు దీనికి ఆమోదం తెలిపారని కూడా అడిగారు. అలాగే, అలా చేయడానికి వారిపై ఒత్తిడి

- మిగతా 2లో పేజీలో

## మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం కొనుగోలు చేయాలి



- ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా కేంద్రం చిత్తశుద్ధి చూపించాలి
- కరువు మండలాల ప్రతిపాదనలకు అవసరమైన సమాచారాన్ని అందించాలి
- వర్షాభావ పరిస్థితులపై రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదారాబాద్, **అభ్యుదయం**రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని మండలం యూనిట్‌గా కరువు మండలాల ప్రతిపాదనలకు డిపార్ట్ మెంట్ సేకరించిన సమాచారాన్ని వారికి అందచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ

మిగతా 2లో

## జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు

- వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- చేయూత పింఛన్ ద్వారా 15.60 లక్షల మందికి లబ్ధి
- ప్రతి జిల్లాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారి
- వృద్ధాప్యంలో ఆర్థిక భారం పడకుండా నగదు రహిత వైద్యం
- ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియ సులభతరం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడి



హైదారాబాద్, **అభ్యుదయం** వృద్ధుల గౌరవం, భద్రత, ఆరోగ్యం, ఆర్థిక భరోసాకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. వృద్ధులు తమ సమస్యలను సులభంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ప్రతి జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల అమలు, వారి హక్కుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

మిగతా 2లో



## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు

2లో

## ఫారం- 6లో మార్పులకు ఎవరు ఆదేశించారు?

తీసుకువచ్చారా అని కూడా రాహుల్ గాంధీ వరుసగా ప్రశ్నలు సంధించారు. దీంతో టీసీఎస్ కూడా ఈ వ్యవహారంలో జవాబు చెప్పాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ముఖ్యంగా ఈసీ నుంచి తమకు వచ్చిన ఆదేశాలు, వాటి అమలుకు సంస్థలో ఎవరు ఆమోదం తెలిపారన్న అంశాల్ని ఇప్పుడు టీసీఎస్ బయటపెడుతుందా లేక ఈసీపైనే నెపం వేసి తప్పించుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఈ సర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురూ కలిసి సర్ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని, ఇది దేశద్రోహం కిందికే వస్తుందని ఆరోపించారు. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని, మోదీ- షా ద్వయంపై దర్యాప్తు జరగాలని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటక బెళగావిలో ఓటర్ల పేర్ల తొలగింపు కుట్రకు సంబంధించి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో కేవలం 3 రోజుల్లోనే బెళగావిలో సుమారు 15 వేల మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి ప్రయత్నం జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనికి సంబంధించి వేలాది ఫారం- 7 దరఖాస్తులు వెల్లువెత్తాయని, ఎక్కువగా బీజేపీని వ్యతిరేకించే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని గతంలో చేసిన ఆరోపణల్ని రాహుల్ మరోసారి ప్రస్తావించారు. కర్ణాటక కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నారని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రాహుల్ పేర్కొన్నారు.

## జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా అలాగే సహచర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లురి మాట్లాడుతూ...ఐక్యరాజ్యసమితి 1990 డిసెంబర్ 14న తీర్మానం 45/106 ద్వారా అక్టోబర్ 1ను అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. వృద్ధుల సేవలను గుర్తించడం, వారి జీవనాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలపై సమాజంలో అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 3.53 కోట్ల జనాభాలో 32.69 లక్షల మంది వృద్ధులు ఉన్నారని, వృద్ధుల సంక్షేమంపై అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలు నిర్వహించారని, ఇందులో భాగంగా జిల్లాల వారీగా వివిధ అవగాహన, వైద్య, సామాజిక కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా పిల్లల్లో బాధ్యత పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను సమర్థంగా అమలు చేస్తూ వృద్ధులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 డే కేర్ కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.ఆయా కేంద్రాల్లో పౌష్టికాహారం, వైద్య సేవలు, ఆటలు, వినోద కార్యక్రమాలను ఉచితంగా అందిస్తున్నారనీ వివరించారు. వృద్ధుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు నిర్వహణ ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియను సులభతరం చేశారు. గత ఏడాది నిర్వహణ ట్రిబ్యునళ్లలో 2,505 భరణం కేసులు దాఖలు కాగా 1,346 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో దాఖలైన 409 అప్పీళ్లలో 234 పరిష్కరించారనీ తెలిపారు. తల్లిదండ్రులను నిరాదరించిన పిల్లల నుంచి ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున బదలాయించేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలోని అథారిటీల వద్ద 209 కేసులు నమోదుకాగా 135 పరిష్కరించారనీ అప్పిలేట్ అథారిటీ వద్ద నమోదైన 18 అప్పీళ్లలో 15 పరిష్కరించడం జరిగిందని వివరించారు. వృద్ధులకు అత్యవసర సమయంలో సహాయం అందించేందుకు 14567 టోల్‌ఫ్రీ ఎల్డర్ లైన్ అందుబాటులో ఉందనీ మంత్రి తెలిపారు.

## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

హైదారాబాద్, అక్టోబర్ 01 తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్యటనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళిలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి "సడక్ సే సదన్ తక్" కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలెజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?



వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

మరోవైపు రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగు దేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెళ్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ . నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు. అదేదో ఇక్కడనే మైక్ ముందు ఒర్లితే అయిపోతుండేనన్నారు. రేవంత్ రెడ్డి అక్కడికిపోయి ఏదో దండయాత్రకు పోయినట్టు.. ఒక ముఖ్యమంత్రి, ఒక పీసీసీ ప్రెసిడెంట్, ఆరుగురు మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు.. ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయినట్టు పోయారు.. మళ్లీ పేరేమో నల్లమల పులి.. ఎక్కడన్నా నల్లమల పులి 4000 పోలీసులను పెట్టుకోని పోతడా.. అంతమందిని కాపాలా పెట్టుకోని పోయిటోడివి.. నువ్వు పులివా.. నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు దగ్గర పిల్లి నువ్వు.. అని చురకలంటించారు. రేవంత్ రెడ్డి పెద్ద కొలంబస్ లెక్క.. వాస్కోడిగామా కదా ఏదో కనుక్కున్నట్టు నువ్వేం కనిపెడితివి కొత్తగా.. అఫిడవిట్‌లో ఉన్నదే నువ్వు చెప్తున్నవ్.. మరి వ్యాపారం చేసుకునుడు తప్పా..వాళ్లకు బువ్వ పెట్టనీకి నేను వ్యాపారం బరాబర్ చేస్తా తప్పేందన్నారు కేటీఆర్.

## 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు

'కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు .ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి కో-పైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదానికి దారితీసే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు.

## మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం కొనుగోలు చేయాలి

శాఖ రూపొందించిన కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం కేవలం వర్షపాతం లోటును మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, వర్షపాతం వ్యత్యాసం, డ్రా×, పొడి కాలం, విత్తిన విస్తీర్ణం, నేల తేమ, రిజర్వాయర్ నిల్వలు, భూగర్భజల పరిస్థితులు, ప్రవాహ జలాలు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధివలసలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, దీనికి గాను వ్యవసాయశాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను వారికి ఇవ్వాల్సిందిగా మంత్రి ఆదేశించారు. కరువు తీవ్రతను బహుళ సూచికల ఆధారంగా అంచనా వేసి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలనతో పంట నష్టాన్ని నిర్ధారించాలని పేర్కొన్నారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం లోటు ఉంటే లోటు వర్షపాతంగా, 60 నుంచి 99 శాతం లోటు ఉంటే భారీ లోటుగా, వర్షం పూర్తిగా లేకపోతే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణించాలని కరువు నిర్వహణ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా, సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే 85 శాతం కంటే తక్కువగా ఉండటం కరువు పరిస్థితికి, 75 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం తీవ్రమైన కరువు పరిస్థితికి సూచికగా పరిగణించాలని పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. మద్దతు ధర ప్రకటించడంతో కేంద్రం బాధ్యత అయిపోదని, ఆ మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చూడటం కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క బాధ్యతే అని మంత్రి తుమ్మల అన్నారు. నిన్న కేంద్ర కేబినెట్ రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కు సంబంధించి కనీస మద్దతు ధరలను పెంచింది. ఇందులో కుసుమ పంటకు క్వింటాల్‌కు రూ.675, రేప్‌సీడ్--ఆవాలకు రూ.413, మసూర్‌కు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున పెంపు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పిఎస్‌ఎస్ లో ఆయా రాష్ట్రాలలో సాగవుతున్న పప్పుధాన్యాలు, నూనెగింజల మొత్తం ఉత్పత్తిలో నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే సేకరిస్తుందని, అలా కాకుండా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ మద్దతు ధరకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, రైతు పండించిన పంటను ఆ ధరకు విక్రయించుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చిత్తశుద్ధితో కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ప్రకటించిన మద్దతు ధరకు 100 శాతం పంటల సేకరణ జరిగినప్పుడే రైతులకు కలుగుతుందని ఆయన అన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ ఎండి రాహుల్ రాజ్ మరియు హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

## ఎర్రవల్లి భూ సర్వే నివేదిక సిద్ధం

**325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల పరిశీలన**

**244 మంది అనుభవదారులకు నోటీసులు**

**ప్రభుత్వానికి అందజేయనున్న అధికారులు**

హైదారాబాద్, అక్టోబర్ 01: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి భూముల సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు చేపట్టిన సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ నేడు ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నివేదికలో ఏ అంశాలను పొందుపరిచారు? భూములపై ఎలాంటి వివరాలు వెల్లడవుతాయి? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలో 118 మందికి నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆయా భూముల్లో క్షేత్రస్థాయిలో హద్దులు, కబ్జాపై ఉన్నవారి వివరాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో ఎనిమిది రోజుల పాటు, వెలికట్టలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. ఈ భూముల విషయంలో శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని వారు చెబుతున్నారు. ఇటీవల వెంకటాపూర్ రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. పాత రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సర్వే నంబర్ 325లో భూములు సాగు చేసుకుంటున్న రైతుల్లోనూ ఆందోళన ఉంది. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. సర్వే సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, ఇతర పత్రాలను అధికారులకు చూపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మర్కూక్ మండల పరిధిలోని భూములపై లెక్కలు తేల్చాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పుడు కలెక్టర్ సమర్పించనున్న నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.

## సర్? ప్రక్రియ పొడిగింపు లేదు

హైదారాబాద్, అక్టోబర్ 01 తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

అభ్యుదయం
శుక్రవారం 2-10-2026

# వృద్ధురాలిని హత్య చేసిన మనుమడు

హైదరాబాద్, అక్టోబర్ 01 బంధాలు బుగ్గవుతున్నాయి.. మానవత్వం మంటగలుస్తోంది. ఆప్యాయంగా ఒడిలో దాచుకున్న చేతులే.. చివరకు ఆ గొంతును నులిమాయి. వృద్ధాప్యంలో తనకు ఆసరాగా ఉంటాడనుకున్న వాడే.. కాసుల కక్కుర్తితో కాలయముడయ్యాడు. ఇంటి ఈఎంఐలు చెల్లించేందుకు తనకు జోలపాడిన నానమ్మనే హత్య చేసిన మనుమడి ఘాతుకం యాదాద్రి భువనగిరి జిల్లాలో కలకలం రేపింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటకు చెందిన యాదమ్మకు వివాహమైన ఆరు నెలలకే భర్తతో విభేదాలు వచ్చాయి. అప్పటి నుంచి ఆమె తన పుట్టిన ఊరైన తూప్రాన్‌పేటలోనే ఒంటరిగా జీవిస్తోంది. వృద్ధాప్యంలో ఉన్న యాదమ్మను ఆమె మేనల్లుడి కుమారుడు రాజు తరచూ చూసుకునేవాడు. దీంతో యాదమ్మకు రాజుపై నమ్మకం పెరిగింది. రాజు పాల వ్యాపారం చేసేవాడు. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల తూప్రాన్‌పేట బ్యాంకు కాలనీలో రూ.36 లక్షల బ్యాంకు రుణంతో ఇల్లు కొనుగోలు చేశాడు. అయితే నెలనెలా ఈఎంఐలు చెల్లించడం అతడికి భారంగా మారింది. రుణ వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంకు నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో యాదమ్మ వద్ద బంగారం, వెండి ఆభరణాలు ఉన్న విషయం రాజుకు తెలిసింది. వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టి ఈఎంఐలు చెల్లించేందుకు సహాయం చేయాలని యాదమ్మను కోరాడు. అయితే ఆ నగలు కుటుంబ సభ్యులందరికీ చెందుతాయని, తాను వాటిని ఇవ్వలేనని యాదమ్మ స్పష్టం చేసింది. యాదమ్మ తనకు సహకరించకపోవడంతో రాజు ఆగ్రహానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. నగల కోసం ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. తాడుతో యాదమ్మ గొంతు నులిమి హత్య చేసి.. ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. యాదమ్మ (70) గత నెల 27న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లోని బంగారు నగలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. మేనల్లుడు దర్శన్ ఇచ్చిన ఫిర్యాదుతో చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదికలో యాదమ్మది సహజ మరణం కాదని.. హత్యగా తేలడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. హత్య అనంతరం రాజు వ్యవహారశైలిపై




పోలీసులకు అనుమానం వచ్చింది. సాధారణంగా యాదమ్మతో తరచూ మాట్లాడే రాజు.. ఘటన తర్వాత ఆమెకు దూరంగా ఉండటం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో అతడి కాల్‌డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. దీంతో రాజుపై అనుమానాలు మరింత బలపడ్డాయి. రాజును అదుపులోకి తీసుకుని విచారించగా.. నగల కోసమే యాదమ్మను హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి 5.6 తులాల బంగారం, వెండి ఆభరణాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. నమ్మిన మనిషే.. తన జీవితానికి చివరి రోజుల్లో అండగా నిలవాల్సిన వాడే.. నగల కోసం ప్రాణం తీసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## 75అడుగుల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కటౌట్ ఆవిష్కరణ




విజయవాడ, అక్టోబర్ 1 (: తిరుపతి లో ఈనెల 6వ తేదీ 75అడుగుల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కటౌట్ ను ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 7వ తేదీ నాటికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 25 సం పరిపాలన పూర్తి అవుతున్న నేపథ్యంలో 76 గంటలపాటు విరామం లేకుండా 1000 మంది దళితులు తో డప్పు వాయిద్యాలు మ్రోగించి గిన్నిస్ బుక్ లో నమోదు చేయనున్నట్లు మాధవ్ ప్రకటించారు

## హెచ్‌డీఎఫ్‌సీ ఎండీ, సీఈవోగా అనుప్ బగ్చీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 01 దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీకి నూతన సారథి రానున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అనుప్ బగ్చీని నియమిస్తున్నట్లు బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అనుప్ బగ్చీ నియామకంతో పాటు ఆయన వేతన ప్యాకేజీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అక్టోబర్ 1న ఆమోదం తెలిపింది. ఆయన 2026 అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బగ్చీ పదవీకాలం 2029 అక్టోబర్ 26న ముగుస్తుంది. ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం ఖరారైంది. ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన అనుప్ బగ్చీకి బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. గతంలో ఆయన ఐసీఐసీఐ గ్రూప్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవోగానూ ఆయన సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన బగ్చీ నాయకత్వంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పురోగతి సాధిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వేగంగా వచ్చి ఏడుగురిని ఢీకొట్టిన కారు!

**సీసీటీవీ ఆధారంగా నిందితుడు గుర్తింపు, అరెస్ట్**

హైదరాబాద్, అక్టోబర్ 01 కుషాయిగూడలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈసీఐఎల్‌లోని న్యూ చైతన్య కాలేజ్ సమీపంలో దేవి మొబైల్ షాప్ ఎదురుగా నడుచుకుంటూ వెళ్తున్న ఏడుగురిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు గాయపడగా.. ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం..కారు వెనుక నుంచి వేగంగా వచ్చి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కొందరు రోడ్డుపై ఎగిరిపడినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో అజయ్ కుమార్, బిపిన్ కుమార్ యాదవ్, రాకేష్ యాదవ్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను తొలుత శ్రీకర రాఘవేంద్ర ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సూర్యా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే కారు ఆపకుండా డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పవన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కారును నడిపినట్లు పోలీసులు గుర్తించి అతడిని అరెస్ట్ చేసినట్లు సమాచారం.

ప్రమాద సమయంలో పవన్ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. అతనితో పాటు కారులో మరో వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. నిన్న తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో మొత్తం ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు తెలిసింది. కాగా.. ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వేగంగా వచ్చిన కారు ఒక్కసారిగా పాదచారులను ఢీకొట్టిన దృశ్యాలు అందులో కనిపించడంతో ఈ వీడియో చూసిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వయోవృద్ధులైన తల్లిదండ్రులు పట్ల పిల్లలు బాధ్యతతో మెలగాలి

**-జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి యన్.శ్రీలక్ష్మి**



ఏలూరు, అక్టోబరు 01ప్రపంచ వృద్ధులు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రేమాలయం వృద్ధులు ఆశ్రమం నందు గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి యన్.శ్రీలక్ష్మి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి యన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ వయోవృద్ధులైన తల్లిదండ్రులు పట్ల పిల్లలు బాధ్యతతో మెలగాలని, వయోభారంతో తల్లిదండ్రులను పిల్లలు భారముగా చూడరాదని అన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవ్వటం వల్ల వృద్ధులైన తల్లిదండ్రులు పట్ల పిల్లలు బాధ్యత రహితంగా ఉంటున్నారని, ఇది సమాజానికి చెడుచేస్తుందని సూచించారు. తదనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమాలయం గౌరవ అధ్యక్షులు టి.వి.వెంకటేష్ గురూజీ, ప్రెసిడెంటు టి.వి. సుబ్బారావు, వైస్ ప్రెసిడెంటు ఎం.ఎన్.వి మురళీకృష్ణ, జనరల్ సెక్రెటరీ యన్,రాంబాబు, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల వరకు రేవంత్, మహేష్ కలిసి ఉంటారా?

**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఎద్దేవా**

హైదరాబాద్, అక్టోబర్ 01 తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ జోడీ ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించారు. వీరి జోడీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వీళ్లు గొప్పగా చెప్పుకుంటున్నారని... వీళ్లు ఎన్ని రోజులు కలిసుంటారో వీళ్లకే తెలియదని ఎద్దేవా చేశారు. ఈయన పీసీసీ ప్రెసిడెంట్ గా ఉంటాడో లేదో ఆయనకు తెలియదని... ఆయన సీఎంగా ఉంటాడో లేదో ఈయనకు తెలియదని అన్నారు. మీ జోడీ, మీ పేర్లు చూసి జనాలు ఓట్లు వేసినట్టయితే... 2023 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో 7 నియోజకవర్గాలుంటే ఒక్కటైనా గెలిచావా రేవంత్ రెడ్డీ? అని ప్రశ్నించారు.

## హైదరాబాద్‌లో యువతులతో హైటెక్ దందా..!

హైదరాబాద్, అక్టోబర్ 01: హైదరాబాద్ గచ్చిబౌలిలో హోటల్ కేంద్రంగా సాగుతున్న హైటెక్ వ్యభిచార వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు. విదేశీ మహిళలను నగరానికి తీసుకొచ్చి హోటల్‌లో వేర్వేరు గదులు ఏర్పాటు చేసి వ్యభి చారం నిర్వహిస్తు న్నారన్న విశ్వసనీయ సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు సంయుక్తంగా డ్రీమ్ ఫ్రైడ్ హోటల్‌పై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఢిల్లీకి చెందిన నిఖిల్, రామ్మోహన్‌రెడ్డితో పాటు హర్షిత్ సింఘానియాను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు హోటల్‌లో ఉన్న ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో నిఖిల్ ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరించినట్లు గుర్తించగా, అతడికి రామ్మోహన్‌రెడ్డి సహకరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. దాడుల సందర్భంగా హోటల్‌లో సోదాలు నిర్వహించిన పోలీసులు రూ.13 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. రామ్మోహన్‌రెడ్డి వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేసి, వాటిలోని సమాచారాన్ని పరిశీలిస్తున్నారు. పోలీసుల విచారణలో పట్టుబడిన ముగ్గురు మహిళలు కొద్దిరోజుల క్రితమే హైదరాబాద్‌కు వచ్చినట్లు వెల్లడైనట్లు సమాచారం. వారి పాస్‌పోర్టులు, వీసాలను పరిశీలించగా అవి చెల్లుబాటులో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే, హైదరాబాద్ నగరానికి వచ్చిన తర్వాత వారు ఎవరిని సంప్రదించారు.. హోటల్‌లో గదులు ఎవరు ఏర్పాటు చేశారు..



విదేశీ మహిళలను ఈ వ్యవహారంలోకి ఎవరు తీసుకొచ్చారు..? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా విటులను సంప్రదించి హోటల్‌కు రప్పించారా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలోని కాల్ వివరాలు, సందేశాలు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించడం ద్వారా ఈ వ్యవహారం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉంది.. ఇంకా ఎంతమంది ఉన్నారనే విషయాలను గచ్చిబౌలి పోలీసులు ఆరా తీస్తున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీఈసీ రాజీనామా చేసేదాకా ఉద్యమం ఆగదు : అభిజీత్ దీప్కే



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు తమ ఉద్యమం ఆగదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టంచేశారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ పిలుపునిచ్చింది. అక్టోబర్ 2 నుంచి ఈ నిరసనలు ప్రారంభంకానున్నట్లు అభిజీత్ దీప్కే తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టంచేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలని, పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పించాలని అన్నారు. ముంబయిలోని శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న సాయంత్రం 'జైల్ భరో ఆందోళన్' చేపట్టాలని సీజేపీ నిర్ణయించింది.

అయితే ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అక్కడ సభల నిర్వహణకు అనుమతి లేదని తెలిపారు. ప్రత్యామ్నాయ వేదికను ఎంచుకోవాలని సూచించారు. ఇదిలావుంటే పోలీసులే కాకుండా శివాజీ పార్క్ పరిసరాల్లోని నివాసితులు కూడా ఈ నిరసనను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తున్నది.

## యూట్యూబర్ రావణ్‌కు షాక్.

హైదరాబాద్, అక్టోబర్ 0 యూట్యూబర్ రావణ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో (అక్టోబర్ 2) ముగియనుంది. ఈ నేపథ్యంలో, కేసులో మరింత లోతైన విచారణ జరిపి, కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం, దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది. విచారణ పూర్తి చేయడానికి మరో 30 రోజుల గడువు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రావణ్ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని, సాయుధ విప్లవానికి మద్దతు ఇస్తున్నాడని జనసేన నేత ఒకరు చేసిన ఫిర్యాదు మేరకు జూలై నెలలో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసి ఉపా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో దర్యాప్తు అధికారులు విచారణను కొనసాగించి, తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily
శుక్రవారం 2-10-2026

# అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్త దారుణ

- హత్య: కేసు ఛేదించిన గణపురం(ఎం) పోలీసులు
- భార్యతో సహా ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చి ప్రాణాలు తీసిన వైనం
- హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్లాన్

జయశంకర్ - భూపాలపల్లి, అక్టోబర్ 1: తన అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కక్షతో భార్యే ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేయించిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం(ఎం) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఈ హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. గణపురం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సంపత్ రావు ఈ కేసు వివరాలను వెల్లడించారు.

**కేసు వివరాలు:**

గోలపల్లి గ్రామానికి చెందిన పెండెల సంపత్ (32), వృత్తిరిత్య ప్లంబర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం బుద్ధారం గ్రామంలో నివాసముంటున్నాడు. బుద్ధారం గ్రామానికి చెందిన ఉమ్మల్ల శ్రీకాంత్ (36)తో సంపత్ భార్య పెండెల సుమలత (26)కు ఉన్న పరిచయాన్ని సంపత్ అనుమానించి, శ్రీకాంత్‌ను పలుమార్లు హెచ్చరించాడు. దీంతో తమ బంధానికి అడ్డుగా ఉన్న సంపత్‌ను వదిలించుకోవాలని శ్రీకాంత్, సుమలత ప్రణాళిక రచించారు.

ఈ కుట్ర అమలు కోసం వారు పొలుదాసరి తరుణ్ (23) అనే యువకుడి సహాయం తీసుకుని, అతనికి లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్లాన్ ప్రకారం ఈ నెల 17వ తేదీ రాత్రి శ్రీకాంత్, తరుణ్‌లు సంపత్‌ను బుద్ధారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి తీసుకెళ్లారు. అక్కడ మద్యం బాటిల్‌లో వ్యవసాయ పురుగుల మందు కలిపి సంపత్‌తో బలవంతంగా తాగించారు. దీంతో సంపత్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.

**ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం:**

సంపత్ మరణించిన తర్వాత, నిందితులు మృతదేహాన్ని శ్రీకాంత్‌కు చెందిన ద్విచక్ర వాహనంపై సంపత్ ఇంటికి తీసుకెళ్లారు. సంపత్ స్వయంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించేందుకు, అతని నోటిలో, దుస్తులపై, అలాగే ఇంటి నేలపై పురుగుల మందు పోసి డ్రామా ఆడారు.

**పోలీసుల విచారణ -- నిందితుల అరెస్ట్:**



ఘటనపై 18వ తేదీన మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా గుర్తించి భారతీయ న్యాయ సంహిత చట్టం కింద హత్య కేసు నమోదు చేశారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పంచనామా నిర్వహించిన పోలీసులు, ముగ్గురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు విచారణ కొనసాగుతుంది అన్నారు. సిఐ కర్ణాకర్, ఎస్ఐ అశోక్ ఉన్నారు

# అక్టోబర్ 9న భూపాలపల్లిలో భారీ 'మెగా జాబ్ మేళా'

- 300కు పైగా ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం, 20 వేల మందికి ఉపాధి లక్ష్యం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- గతంలో జాబ్ మేళాలో 10 వేల మందికి పైగా పాల్గొనగా, దాదాపు 2,770 మంది ఉద్యోగాలు సాధించారు: కలెక్టర్ రాహుల్ శర్మ
- ఉచిత రవాణా, భోజన వసతి కల్పన :ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




జయశంకర్ - భూపాలపల్లి, అక్టోబర్ 1:నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా అక్టోబర్ 9న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 'పుష్ప గ్రాండ్' ఫంక్షన్ హాల్‌లో 'మెగా జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెల్లడించారు. గురువారం ఐడీఓసీ భవనంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, డీఆర్డీవో, సింగరేణి, జెన్‌కో తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన జాబ్ మేళా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 300కు పైగా దేశీ, విదేశీ ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. దాదాపు 20 వేల మంది నిరుద్యోగ యువతను సమీకరించి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభిస్తారని, ఎంపీ కడియం కావ్యతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

**గ్రామ స్థాయి నుంచి విస్తృత ప్రచారం -- ఉచిత రవాణా సౌకర్యం:** జాబ్ మేళా సమాచారం ప్రతీ గ్రామానికి చేరేలా గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో అక్టోబర్ 6వ తేదీ లోగా గ్రామాల వారీగా చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకుల వివరాలను సేకరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఉచిత రవాణా సౌకర్యం, ప్రాంగణంలో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. తక్కువ వ్యవధి ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**స్పాట్ ఇంటర్వ్యూలు -- అక్కడికక్కడే నియామక పత్రాలు: కలెక్టర్ రాహుల్ శర్మ**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో 10 వేల మందికి పైగా యువత పాల్గొనగా, దాదాపు 2,770 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. ఈసారి కూడా సింగరేణి, జెన్‌కో యాజమాన్యాలు, టాస్క్ మరియు వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులకు మేళా ప్రాంగణంలోనే ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక పత్రాలు (ఆఫర్ లెటర్లు) అందజేస్తారని తెలిపారు. విద్యార్హతల ఆధారంగా ఉద్యోగావకాశాలు ఉంటాయని, యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డీఆర్డీవో బాలకృష్ణ, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, జెన్‌కో ఎస్ఈ ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దారి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

---కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు
--మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో





జయశంకర్ - భూపాలపల్లి, అక్టోబర్ 1: చిట్యాల మండలం వెంచరామి గ్రామ పంచాయతీ పరిధిలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు, పార్టీ బలోపేతానికి సంబంధించి కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి:**

గత ప్రభుత్వ హయాంలో వెంచరామిలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, కంకర వంటి సామగ్రిని తరలించే దారిని కొంతమంది అక్రమంగా కబ్జా చేయడంతో పనులు నిలిచిపోయాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా గండ్ర మాట్లాడూ... పేదల సొంతింటి కలను నెరవేర్చే ఇళ్ల నిర్మాణ పనులు కేవలం దారి సమస్య వల్ల నిలిచిపోవడం విచారకరమన్నారు. దీనిపై వెంటనే చిట్యాల మండల తహసీల్దార్‌తో ఫోన్లో మాట్లాడి, దారి కబ్జా సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఆటంకాలను తొలగించి, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో లబ్ధిదారుల తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిక:**

అనంతరం స్థానిక సర్పంచ్ శ్రీమతి కాసురమా కుమార్ నాయకత్వంలో, మండల , స్థానిక నాయకుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

చేరిన వారిలో జక్కె వెంకటేశం, మోరే ధర్మరాజు, కళ్లేపల్లి సదయ్య, చేటుకూరి అశోక్, గుర్రం అయిలయ్య, యూత్ ఉపాధ్యక్షుడు తిప్పన శివ, ఆశాడపు మల్లయ్య, పరికిపండ్ల సమ్మయ్య, పరికిపండ్ల సాగర్, పరికిపండ్ల సంతోష్ తదితరులు ఉన్నారు.

**కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష:**

ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ... కేసీఆర్ గారి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి ప్రజలు, నాయకులు తిరిగి బీఆర్ఎస్ వైపు వస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. రైతులకు ఉచిత విద్యుత్, ఎరువుల లభ్యత, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంచరామి నుండి పెద్ద సంఖ్యలో నాయకులు చేరడంతో చిట్యాల మండలంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతమైందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాస్టర్స్ నేషనల్ స్విమ్మింగ్‌లో సింగరేణి క్రీడాకారుల ప్రతిభ

--పతకాలు సాధించిన విజేతలను సన్మానించిన భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి




జయశంకర్ - భూపాలపల్లి, అక్టోబర్ 1: మాస్టర్ స్విమ్మింగ్ నేషనల్ గేమ్స్‌లో సింగరేణి కుటుంబానికి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విజేతలను గురువారం జీఎం కార్యాలయంలో ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**విజేతల వివరాలు:**

కందుకూరి రాజేశ్వరరావు (సింగరేణి మాజీ ఉద్యోగి): 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో వెండి పతకం సాధించారు.

బడే పూర్ణచందర్ రావు ( తండ్రి బడే భాస్కర్ రావు, కేటీకే-6 ఇంక్లైన్ ట్రమ్మర్): 100 మీటర్ల బటర్ ఫ్లై స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, 200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య (బ్రాంజ్) పతకం సాధించారు.

ఈ సందర్భంగా జీఎం రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... "క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయి. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ మాస్టర్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక కావడం సింగరేణి సంస్థకే ఎంతో గర్వకారణం. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి, సింగరేణి కీర్తిని మరింత ఇనుమడింపజేయాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ విశ్రాంత్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్ పాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

-వృద్ధులకు అండగా చట్టాలు.. అనాథలుగా వదిలేస్తే ఆస్తులు వాపస్!
--ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ - భూపాలపల్లి, అక్టోబర్ 1:వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సంతానంపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అవసరమైతే పిల్లలకు బదిలీ చేసిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరు మీదకు మార్చే వెసులుబాటు ఉందన్నారు. అర్హులైన వారందరికీ సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులు, రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. భూపాలపల్లి హనుమాన్ నగర్‌లో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేశామని, త్వరలోనే శాశ్వత భవనాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ..తల్లిదండ్రుల పోషణను విస్మరిస్తే ఆర్డీఓ కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులు సైతం తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వారోత్సవాలు విజయవంతమయ్యాయని, వయోవృద్ధుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్రా కొమురయ్య, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్, డీఆర్డీఓ బాలకృష్ణ, పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# సభకు తీసుకెళ్లి..డబ్బులివ్వలేదు..

కాంగ్రెస్ నేతతో ఇన్‌చార్జిల వాగ్వాదం.. ఆడియో వైరల్

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 1: 'లేకలేక ఏర్పాటు చేసిన సభ.. మళ్లీ ఎప్పుడుంటదో తెల్వది.. అవకాశమున్నప్పుడే అందినకాడికి దండుకోవాలనుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ కాంగ్రెస్ నేత సభకు వెళ్లిన మహిళలకు ఇవ్వాల్సిన డబ్బులు తన వద్ద ఉంచుకుని ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో బుధవారం సదరు నేత ఇంటి వద్ద గొడవ జరిగినట్టు తెలిసింది. స్థానికులు తెలిపిన, సోషల్ మీడియాలో వైరల్ అయిన వాయిస్ రికార్డు వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని ఓ గ్రామంలో బస్సులో మందిని తీసుకెళ్లేందుకు ఇద్దరు ఇన్‌చార్జిలకు బాధ్యతలు ఇచ్చారు. ఎలాగోలా కష్టపడి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున ఇప్పిస్తామని 60 మందిని బస్సులో తీసుకెళ్లారు. సభ ముగిసిన తర్వాత డబ్బులు కావాలని ఇన్‌చార్జిలను అడిగారు. డబ్బులు తీసుకున్న వ్యక్తి మాత్రం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఓ చోట కూర్చున్నాడు. ఇన్‌చార్జి తీసుకున్న వ్యక్తులు ఎంత ఫోన్ చేసినా స్విచ్చాఫ్ రావడం.. సభకు వెళ్లిన వారు డబ్బుల కోసం నిలదీయడంతో డబ్బులు తీసుకున్న నాయకుడి ఇంటికి వెళ్లారు.

# లంకను గెలిచిన భారతం



**45 పరుగులకే శ్రీలంక ఆలౌట్..**

**124 పరుగుల తేడాతో భరత్ విక్టరీ**

**విధ్వంసం సృష్టించిన ఇషాన్ కిషన్**

2026 ఆసియా క్రీడల రెండో క్రికెట్ సెమీ-ఫైనల్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఈ టోర్నీలో తొలిసారిగా అడుగుపెట్టిన భారత్.. వర్షం వచ్చినప్పుడల్లా భారత్‌ను ఎందుకు ఛాంపియన్‌గా పరిగణిస్తారో నిరూపించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 169 పరుగులు చేసింది. ఆ తర్వాత 9.5 ఓవర్లలో శ్రీలంకను 45 పరుగులకే ఆలౌట్ చేసి.. 124 పరుగుల తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున అభిషేక్ శర్మ మోస్ట్ సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మ కేవలం 5 బంతుల్లో 2 పరుగులకే 2 వికెట్లు పడగొట్టాడు. అభిషేక్ శర్మ ఓవర్‌లోని చివరి మూడు బంతులకు శ్రీలంక వికెట్లు కోల్పోయింది. తొమ్మిది ఓవర్ల తర్వాత శ్రీలంక స్కోరు 43-7గా ఉండగా.. ఆ తర్వాతి ఐదు బంతుల్లో అభిషేక్ శర్మ బౌలింగ్ భారత్‌కు విజయాన్ని ఖాయం చేసింది. జపాన్‌లో నిషిన్ నగరంలోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ స్టేడియం వేదికగా శ్రీలంక జట్టుతో జరుగుతున్న ఆసియా క్రీడల సెమీ-ఫైనల్ మ్యాచ్ లో భారత్ అద్భుతంగా రాణించింది. క్లిష్టమైన పిచ్ పై భారత్ అద్భుతంగా పోరాడి భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. శ్రీలంక ముందు 170 పరుగు భారీ లక్ష్యాన్ని ఉంచింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంకకు ఆరంభంలోనే అద్భుతమైన ప్రారంభం లభించింది. మొదటి 3 ఓవర్లలోనే అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను వరుసగా పెవిలియన్ పంపి టీమిండియాను దెబ్బతీసింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే భారత్ తడబడుతున్న సమయంలో యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ భయపడకుండా కౌంటర్ ఎటాక్ ప్రారంభించాడు. కేవలం 21 బంతుల్లో 38 పరుగులు సాధించి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. వైభవ్ సూర్యవంశీ దాడితో భారత్ పవర్‌ప్లే ముగిసేసరికి 58/2 స్కోరుతో బలమైన స్థితిలో నిలిచింది. అయితే మిడిల్ ఓవర్లలో శ్రీలంక స్పిన్నర్లు మ్యాచ్ ను మళ్లీ తమ వైపు తిప్పుకున్నారు. సహన్ అరచ్చిగే బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ ఔట్ కాగా.. వనుజ సహన్ బౌలింగ్‌లో శ్రేయస్ అయ్యర్



(13) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. లంక స్పిన్నర్లు పకడ్బందీ బౌలింగ్‌తో రన్ రేట్‌ను కట్టడి చేస్తూ వరుస వికెట్లు పడగొట్టారు.
అక్షర్ పటేల్, తిలక్ వర్మ, శివమ్ దూబే తక్కువ స్కోర్లకే నిష్క్రమించ`డంతో భారత్ ఒకానొక దశలో 151/7తో కష్టాల్లో పడింది. ఓ వైపు వరుసగా వికెట్లు పడుతున్నప్పటికీ ఇషాన్ కిషన్ ఒంటరి పోరాటం చేస్తూ ఇన్నింగ్స్ ను నిలబెట్టాడు. ఆరంభంలో నిలకడగా ఆడిన ఇషాన్ కిషన్.. డెత్ ఓవర్లలో చెలరేగిపోయి 46 బంతుల్లో 80 పరుగులు సాధించాడు. చివరిలో వాషింగ్టన్ సుందర్ మెరుపు కామియో జోడించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది.

## భారత్ తరఫున ఆడటం వేరే ఫీలింగ్!

ఆసియా క్రీడల్లో భారత్ తరఫున ఆడటం.. అందులోనూ పతకం కోసం పోరాడటం చాలా ప్రత్యేకమైన అనుభూతినిస్తుందని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. సాధారణ అంతర్జాతీయ మ్యాచ్‌లతో పోలిస్తే ఆసియా క్రీడల్లో కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో ఇషాన్ కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 80 పరుగులతో రాణించి భారత్ 169 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత బౌలర్లు శ్రీలంకను కేవలం 45 పరుగులకే ఆలౌట్ చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. "భారత్ కోసం ఆడుతున్నప్పుడు.. ముఖ్యంగా పతకం కోసం ఆడుతున్నప్పుడు మనసులో ఏదో ప్రత్యేకమైన భావన ఉంటుంది. ఇక్కడ బీసీసీఐ కోసం కాదు.. మొత్తం దేశం కోసం ఆడుతున్నామనే ఫీలింగ్ వస్తుంది. చుట్టూ భారత జెండాలు కనిపించడం, అభిమానులు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వడం ఆ అనుభూతిని మరింత పెంచుతుంది. బయటకు చూపించకపోయినా లోపల మాత్రం కొంత ఎక్కువ ఒత్తిడి ఉంటుంది" అని ఇషాన్ చెప్పాడు. పగుళ్లు కనిపించే పిచ్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదని ఇషాన్ తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం 150 పరుగులు చేస్తే సురక్షితంగా ఉంటామని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకుంటే చివరి వరకు ఉండి భారీ స్కోరు చేయాలన్నది జట్టు ప్రణాళికగా ఉందని వివరించాడు. "ఇలాంటి పిచ్‌లపై వ్యక్తిగత లక్ష్యాల కంటే జట్టు అవసరాలే ముఖ్యం. పరిస్థితిని గమనిస్తూ చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టాలి" అని పేర్కొన్నాడు. ఇక శనివారం పాకిస్థాన్‌తో జరగనున్న స్వర్ణ పతక పోరుపై కూడా ఇషాన్ స్పందించాడు. మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండాలని, ఆ క్షణాలను ఆస్వాదిస్తూ ఆడాలని జట్టు భావిస్తోందన్నాడు. జపాన్‌లో లభించిన ఆతిథ్యంపై ఇషాన్ ప్రశంసలు కురిపించాడు. భాష సమస్య ఉన్నప్పటికీ స్థానికులు ఎంతో సహాయం చేశారని చెప్పాడు. భారత అభిమానులు ఎక్కడికి వెళ్లినా మద్దతుగా నిలుస్తున్నారన్నారు.

## ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు విజయాల పరంపర



**పాక్‌పై భారత్ సంచలన విజయం నమోదు**

ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు తన 10 ఏళ్ల విజయ పరంపరను కొనసాగించింది. ఉత్కంఠభరితమైన సెమీఫైనల్‌లో పాకిస్థాన్‌ను 4-3 తేడాతో ఓడించి భారత హాకీ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేయగా.. సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్ చెరొక గోల్ సాధించారు. స్కోరు 3-3తో సమమైన తర్వాత 60వ నిమిషంలో భారత్ తన చివరి గోల్‌ను నమోదు చేసింది. గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు. 5వ, 13వ నిమిషాల్లో లభించిన పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచి భారత్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం పాకిస్థాన్ తమ రక్షణ శ్రేణితో గట్టి పోటీ ఇచ్చి పుంజుకోవడానికి ప్రయత్నించింది. 30వ నిమిషంలో అబు మహమూద్, 38వ నిమిషంలో అమ్మాద్ బట్ గోల్స్ చేసి పాకిస్తాన్ జట్టుకు తిరిగి ఆశలు కల్పించారు. మ్యాచ్ చివరి పావుగంటలో, పాకిస్తాన్ స్కోరును సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. 45వ నిమిషంలో షాహిద్ హసన్ గోల్ చేసి స్కోరును 3-3తో సమం చేశాడు. మ్యాచ్ చివరి క్షణాల్లో అభిషేక్ అద్భుతమైన పెనాల్టీని సాధించి భారత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు.

## ప్రపంచకప్ కంటే గోల్డ్ మెడల్ గొప్పది

ఆసియా గేమ్స్ 2026లో బంగారు పతకం గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభవమని, ప్రపంచకప్ కంటే గొప్ప విజయమని టీమిండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అన్నాడు. ఆసియా గేమ్స్ 2026లో భారత్ పురుషుల క్రికెట్ టీమ్ ఫైనల్‌కు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. గురువారం శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 124 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో పాకిస్థాన్‌తో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. సెమీఫైనల్ విజయానంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన అక్షర్ పటేల్..తన అనుభవాలను పంచుకున్నాడు. గేమ్ విలేజ్‌లో ఉండటం ప్రత్యేక అనుభూతినిస్తోందని చెప్పాడు. 'ఏ జట్టు అయినా గెలవాలంటే గట్టిగా ప్రయత్నించాలి. మేం చేయాల్సింది మేం చేశాం. అయితే ఈ మ్యాచ్ ఆడేందుకు చాలా రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. వర్షం పడటం వల్ల మ్యాచ్‌లు జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత మ్యాచ్ జరిగినప్పటికీ జట్టులోని ప్రతీ ఒక్కరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు.



పాకిస్తాన్, బంగ్లాదేశ్ మ్యాచ్‌లు కూడా ఇదే పిచ్‌పై జరిగాయి. ఆ మ్యాచ్‌లు చూశాక ఈ వికెట్‌పై 140-150 పరుగులు చేస్తే గెలిచే అవకాశం ఉంటుందని అంచనా వేశాం. కానీ మేం అదనంగా(169) 10-15 పరుగులు ఎక్కువే చేశాం. మ్యాచ్ ఆరంభంలో బంతికి డ్రిఫ్ట్, టర్న్, బౌన్స్ బాగా లభించాయి. పాకిస్థాన్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్ ఏ వికెట్‌పై ఆడిస్తారనే దానిపై ప్రస్తుతం మాకూ సమాచారం లేదు. దీని గురించి మాట్లాడాం కానీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. అయితే ఇక్కడి మైదానంలో మూడు వికెట్లు ఉన్నాయి. మూడూ దాదాపు ఒకేలా పగుళ్లతో కనిపిస్తున్నాయి. కాబట్టి ఏ వికెట్‌పై ఆడినా పిచ్ ప్రవర్తనలో ఎలాంటి తేడా ఉండే అవకాశం లేదు. ఇక్కడి భారతీయ రెస్టారెంట్ల నుంచి పార్సిల్ తెప్పించుకొని తింటున్నాం. తిండి విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడ మూడు, నాలుగు ఇండియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. వాళ్ల ఫుడ్ బాగా వండుతున్నారు. జపాన్‌లో క్రికెట్ ఎక్కువగా ఆదరన్న విషయం తెలిసిందే. కానీ వాళ్ళు చేస్తున్న కృషి మాత్రం అద్భుతం
. మైదానంతో పాటు వాతావరణం విషయంలో వాళ్ళ పరిమితుల మేరకు మంచి ఏర్పాట్లు చేశారు. రాబోయే రోజుల్లో క్రికెట్ సౌకర్యాలను మరింత పెంచి, ఇంకా మంచి పరిస్థితులు కల్పిస్తారని ఆశిస్తున్నా. నేను గేమ్స్ విలేజ్‌లో ఉండటం ఇదే తొలిసారి. ఈ అనుభవం చాలా బాగుంది.

## 148 ఏళ్ల క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి..!

క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రికార్డ్‌ను టీమిండియా సొంతం చేసుకుంది. తొలి 30 ఓవర్లలోనే 300 పరుగులు చేసిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో గౌహతి వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో 406 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన భారత్.. శుభ్‌మన్ గిల్(130 బంతుల్లో 25 ఫోర్లు, 8 సిక్స్‌లతో 217 నాటౌట్), రోహిత్ శర్మ(75 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101) విధ్వంసకర బ్యాటింగ్‌తో 29.1 ఓవర్లలోనే 300 పరుగులు చేసింది. మరో 39 బంతులు మిగిలి ఉండగానే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డ్ విజయాన్ని అందుకుంది. క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు కూడా 30 ఓవర్లలోపు 300 పరుగులు చేయలేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడటంతో ఈ రికార్డ్ సాధ్యమైంది. 10 ఓవర్లలోనే 92పరుగులు చేసిన ఈ జోడీ.. 21.1 ఓవర్లలో 200 పరుగుల మైలురాయిని అందుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన జట్టుగానూ భారత్ నిలిచింది. తొలి వికెట్‌కు 255 పరుగులు



జోడించిన అనంతరం రోహిత్ శర్మ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగినా.. క్రీజులోకి వచ్చిన కోహ్లీ దూకుడుగా ఆడాడు. శుభ్‌మన్ గిల్ కూడా బౌండరీల మోత మోగించడంతో భారత్ 29.1 ఓవర్లలోనే (175 బంతుల్లో) 300 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. గతంలో సౌతాఫ్రికా మాత్రమే 32.2 ఓవర్లలో 300 పరుగులు చేసింది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఈ ఫీట్ సాధించింది. 2006లో శ్రీలంకపై ఇంగ్లండ్ 33.1 ఓవర్లలో, 2009లో శ్రీలంకపై భారత్ 34.1 ఓవర్లలో 300 పరుగులు చేశాయి. ఈ పాత రికార్డ్‌లన్నింటిని తాజాగా భారత్ బద్దలుకొట్టింది.

## (సంపాదకీయం)

# జయహో స్మిత్ మచ్చార్!

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని ప్రమాదం తప్పింది. గాల్లో ఉండగానే కో-పైలట్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన భారత సంతతి కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. రక్తమోడుతున్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచి, పెను విమాన ప్రమాదాన్ని నివారించి 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. బోయింగ్ 737 మ్యాక్స్-8 విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా భావిస్తున్న కో పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై కత్తితో దాడి చేశాడు. విమాన నియంత్రణ వ్యవస్థలను ధ్వంసం చేసి, విమానాన్ని కూల్చేందుకు అతను తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో విమానం కేవలం 30 సెకన్లలోనే దాదాపు 14,000 అడుగుల కిందికి దూసుకువచ్చింది. తీవ్ర గాయాలపాలై కిందపడిపోతున్న సమయంలో కూడా కెప్టెన్ స్మిత్ చాకచక్యంగా కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేసి కేకలు వేశారు. విమానం తీవ్ర కుదుపులకు లోనవడం, అరుపులు వినిపించడంతో అప్రమత్తమైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. కాక్‌పిట్‌లోకి చొరబడిన ప్రయాణికులలో యానివ్ అనే ఇజ్రాయెల్ ప్లంబర్ ప్రధాన పాత్ర పోషించారు. టీవీలో ప్రసారమయ్యే ఎయిర్ డిజాస్టర్స్ కార్యక్రమాలు చూసి విమానాల నియంత్రణపై ప్రాథమిక అవగాహన పెంచుకున్నట్లు చెప్పిన యానివ్, ఇతర ప్రయాణికులతో కలిసి విధ్వంసానికి పాల్పడుతున్న కో-పైలట్‌ను కుర్చీ నుంచి వెనక్కి లాగి బంధించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్లు, భద్రతా సిబ్బంది వెంటనే కాక్‌పిట్ నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుని విమానాన్ని అదుపు చేశారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దాదాపు 8 గంటల నిరీక్షణ అనంతరం ప్రయాణికులను మరో ప్రత్యామ్నాయ విమానంలో టెల్ అవీవ్‌కు తరలించారు. గుజరాత్‌కు చెందిన స్మిత్ మచ్చార్ కమర్షియల్ ఏవియేషన్ రంగంలో పదేళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన పైలట్. జూన్ 2011 నుండి 2022 వరకు దాదాపు 11 ఏళ్లపాటు భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2022లో డైరెక్ట్ ఎంట్రీ కెప్టెన్‌గా ఫ్లైదుబాయ్‌లో చేరారు. బోయింగ్ 737 విమానాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల్లో ఆయన నిపుణుడు. వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ఆయన కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. మచ్ఛర్‌కు కమర్షియల్ విమానయానంలో 13 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఫ్లైదుబాయ్‌లో చేరకముందు ఆయన 11 ఏళ్లకు పైగా స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2011 నుంచి జూన్ 2022 వరకు స్పైస్‌జెట్‌లో విధులు నిర్వహించిన ఆయన సీనియర్ కమాండర్‌గా, లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 2020 నుంచి జూన్ 2022 వరకు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా ఇతర పైలట్లకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. బోయింగ్ 737 విమానాలను 9,500 గంటలకు పైగా నడిపిన అనుభవం మచ్ఛర్‌కు ఉంది. జూన్ 2022 నుంచి ఫ్లైదుబాయ్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ దుబాయ్‌లో నివసిస్తున్నారు. అక్కడ కూడా పైలట్ల శిక్షణ, విమాన కార్యకలాపాల నిర్వహణలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విమానయాన భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలు, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే అనుభవం ఆయన కెరీర్‌లో భాగంగా ఉంది. ప్రస్తుతం సెప్టెంబర్ 30న జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన అద్భుత ధైర్యాన్ని ప్రపంచ నేతలు కొనియాడారు. ఓవల్ ఆఫీస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. "స్మిత్ చాలా తీవ్రమైన గాయాలపాలైనా సమయస్ఫూర్తితో వ్యవహరించి రియల్ హీరోగా నిలిచారు. ఇదొక అద్భుతమైన సంఘటన" అని అన్నారు. తీవ్రంగా గాయపడినా వెనకడుగు వేయకుండా ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యానికి నా సెల్యూట్. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మిత్‌ను అత్యంత నైపుణ్యం కలిగిన వీరుడిగా అభివర్ణిస్తూ, భారత్-ఇజ్రాయెల్-యూఏఈ తరఫున ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నట్లు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మరోవైపు కాక్‌పిట్‌లో గొడవ జరుగుతున్న విషయం గుర్తించిన యానివ్.. వెంటనే అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మరో ప్రయాణికుడితో కలిసి కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు.

చివరకు లోపలికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు సహకరించారు. ఈ ఘటనలో యానివ్ షర్టుపై రక్తపు మరకలు కనిపించాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌కు చేరుకున్న తర్వాత యానివ్ హయూన్ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కలిశారు. ఈ సందర్భంగా నెతన్యాహు అతన్ని అభినందించారు. 'చాలా గొప్ప పని చేశావు. నువ్వు హీరో' అంటూ ప్రశంసించారు. ఆ తర్వాత విమానంలో జరిగిన పరిణామాలను యానివ్ ప్రధానితో పంచుకున్నారు.

# విజయవాడలో బిజేపీ పధాధికారుల సమావేశం

## హాజరైన ఆంధ్రప్రదేశ్ బిజెపి ఇంఛార్జి అరవింద్ బదౌరియా, సహ ఇంఛార్జి వనతి శ్రీనివాసన్




విజయవాడ, అక్టోబర్ 1 ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ అధ్యక్షతన బిజెపి పదాదికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంకు అతిధి లుగా ఆంధ్రప్రదేశ్ బిజెపి ఇంఛార్జి అరవింద్ బదౌరియా, సహ ఇంఛార్జి వనతి శ్రీనివాసన్ హాజరయ్యారు మంత్రి సత్యకుమార్ యాదవ్, దగ్గుబాటి పురంధేశ్వరి, సిఎం రమేష్, సుజనా చౌదరి, విష్ణుకుమార్ రాజు, రామకృష్ణారెడ్డి, సోము వీర్రాజు, సునీత, ఇతర నేతలు పాల్గొనగా, బిజెపి ఎపి అధ్యక్షులు పివియన్ మాధవ్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్ సెప్టెంబర్ 17 మొదటి కార్యక్రమం చేపట్టాం. రక్తదాన శిబిరాలతో పాటు, ఆయుష్ సంబంధించిన మెడికల్ క్యాంప్స్ సుమారు 600 పైగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించుకున్నాం. అంగన్వాడీలో మనం ఆంగనకి ఉత్సవ పేరు మీదట అంగన్వాడ కార్యక్రమాలు చేస్తున్నాం. అన్ని స్కూల్స్ లో కూడా చిత్రలేఖనం వకృత్వ పోటీలు కూడా ప్రత్యేత నిర్వహిస్తున్నాం. తెలుగు యువత వాళ్ళ ఆధ్వర్యంలో మన తిరుపతి నుంచి వారణాసి వరకు ఒక యాత్ర పెట్టడం జరిగింది సేవ సంకల్ప యాత్ర పేరు మీదట మొన్ననే ప్రారంభమయింది ఇక్కడి నుంచి బైక్స్ లో వెళ్లి నరేంద్ర మోడీ యొక్క మరింత బలాన్ని చూపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా చేస్తుంది. ఈ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు. అక్టోబర్ ఏడవ తారీకు రాష్ట్ర వ్యాప్తంగా మన సేవా జ్యోతి యాత్ర అసెంబ్లీ నుంచి ప్రారంభం అవుతుంది సేవా జ్యోతి యాత్ర లో ప్రతి ఊర్లో ప్రజలు పాల్గొనే విధంగా చేస్తున్నాం రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజక వర్గాల్లో కూడా ఈ సేవా జ్యోతి యాత్ర జరుగుతుంది నరేంద్ర మోడీ సీఎంగా, పీఎం గా 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. అక్టోబర్ 17వ తారీకున ముగింపు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తాం. అలాగే ఆంధ్రప్రదేశ్ కి కేంద్ర ప్రభుత్వం ద్వారా గత 12 సంవత్సరాల పాటు చేసిన సాయాన్ని ప్రజలకు వివరిస్తాం పోలవరం ప్రాజెక్ట్ ను జాతీయ ప్రాజెక్ట్ గా డిక్లేర్ చేసి పెద్ద ఎత్తన నిధులు ఇచ్చింది త్వరలోనే ప్రారంభం కాబోతున్న తరుణంలో అక్కడ జరుగుతున్న పనులు మొత్తం దేశవ్యాప్తంగా చూపించే కార్యక్రమం చేపడతాం. విశాఖపట్నం సంబంధించిన రైల్వే జోన్ పూర్తి చేశాంరాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులు నిర్మాణాలు పూర్తి చేశాం. అమరావతిలో మనం ఏదైతే కేంద్ర ప్రభుత్వం ద్వారా అనేక రకాల నిర్మాణాలు పూర్తి చేశాం. టూరిజం ప్రమోషన్ కోసం చేస్తున్న పనులన్నీ కూడా ప్రజలకు చూపించి, వివరిస్తాం నరేంద్ర మోడీ చేసిన సేవలు, అభివృద్ధిని దేశమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ మన వైపు చూసేలా కార్యక్రమాలు చేపట్టాం. ఇవాళ అనేకమంది దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తున్నారు. ఓట్ చోరి అంశం పై రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారు. దీనికి అమిత్ షా గారు పార్లమెంట్లో జవాబు ఇచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. ప్రజలు మోడీ పాలనపై నమ్మకంతో ఉన్నారు. ప్రజలకు చెప్పిన విధంగా మోడీ అద్భుతమైన పాలనతో ప్రపంచ దేశాలే మనవైపు చూసేలా చేస్తున్నారు దేశంలో అనేక రాష్ట్రాల్లో నేడు మోడీ పై నమ్మకంతో బీజేపీ, యన్డీఎ పక్షాలకు పట్టం కడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కూటమి పార్టీల అభ్యర్దులు గెలుపు ఖాయం. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ఏపీలోపాలన సాగుతుంది. ప్రజలంతా కూటమికి అండగా నిలిచారు.. రేపు స్థానిక సంస్థల్లో కూడా అభివృద్ధి చేయడమే కూటమి లక్ష్యం అన్నారు.

# బీసీలకు 34% రిజర్వేషన్ల రక్షణే ప్రభుత్వ లక్ష్యం

## - బీసీల రిజర్వేషన్ పై సుప్రీంకోర్టుకు వెళ్తాం - మంత్రి వాసంశెట్టి సుభా




రామచంద్రపురం, అక్టోబర్ 01 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్ర ్పురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూనే, బీసీ సామాజిక వర్గాలకు పూర్తి న్యాయం జరిగేలా ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టును ఆశ్రయించబోతున్నామని మంత్రి స్పష్టం చేశారు. 34 శాతం రిజర్వేషన్లకే కట్టుబడి ఉన్నామని,స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 34% రిజర్వేషన్లు అమలు చేయాలనే నిర్ణయానికి తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ద్వారానే క్షేత్రస్థాయిలో నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని నమ్ముతున్నామన్నారు.ఇవి వైసీపీ గొడ్డలి పార్టీ నేతల కుట్రలుగా అభివర్ణించారు. అసెంబ్లీ సాక్షిగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నేతలు కోర్టుకు వెళ్లి కావాలనే అడ్డుకున్నారని మంత్రి మండిపడ్డారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత పెరగకూడదనే కుట్రతోనే 'గొడ్డలి పార్టీ' నేతలు న్యాయస్థానంలో పిటిషన్లు వేసి బీసీలకు తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు.ఎన్నికలను అడ్డుకోవడమే లక్ష్యంగా వైసిపి కుట్రలు పన్నింది అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకూడదని, బీసీలకు దక్కాల్సిన పదవులు దక్కకుండా చేయాలనే ఏకైక అజెండాతో ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత వైసీపీ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16,800 మంది బీసీ నేతలు రాజకీయ పదవులను కోల్పోయారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వారికి ఆయా పదవులను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, మళ్లీ ఆ అవకాశాలు రాకుండా కోర్టుల ద్వారా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది కేవలం రిజర్వేషన్ల అంశం కాదని, ఈ పోరాటం కేవలం సాంకేతిక రిజర్వేషన్ల గురించి మాత్రమే కాదని, బీసీల ఆత్మగౌరవానికి, వారికి దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన జీవన్మరణ సమస్య అని మంత్రి సుభాష్ పేర్కొన్నారు

. బీసీలకు దక్కాల్సిన ప్రతి రాజకీయ అవకాశాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెనకడుగు వేయదని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

# వ్యాపార సంస్థలపై తీవ్రమైన సైబర్ ప్రభావం



న్యూఢిల్లీ, అక్టోబర్ 01 దేశంలో సైబర్ దాడుల ముప్పు ఏ స్థాయిలో ఉందో తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. గత 12 నెలల్లో 96 శాతం భారత సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేసే సైబర్ ఘటనలను ఎదుర్కొన్నట్లు టెక్నాలజీ సంస్థ సిస్కో విడుదల చేసిన తెలిపింది. వీటిలో మూడింట ఒక వంతుకుపైగా ఘటనల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత దాడుల ప్రభావం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. యితే భారతదేశంలోని వ్యాపార సంస్థలు తీవ్రమైన సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కొంటున్నాయని 'సిస్కో' తన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 96% భారతీయ వ్యాపార సంస్థలు సైబర్ దాడులకు గురయ్యాయని, దీనివల్ల వాటి దైనందిన కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలిగిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. భారతదేశంలోని వ్యాపార సంస్థల్లో కేవలం 8% సంస్థలు మాత్రమే అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలను సాధించగలిగాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఆ×) సాంకేతికత సైబర్ బెదిరింపులను త్వరగా గుర్తించడంలో ఎంతగానో దోహదపడుతున్నప్పటికీ, కేవలం 40% సంస్థలు మాత్రమే ఏజెంట్లను ఉపయోగిస్తున్నాయి. అయితే భద్రత బలహీనపడటానికి కారణాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. సంస్థలలో సరైన సమన్వయం లేకపోవడం, డేటా సంక్లిష్టత, అనుమతుల్లో జరిగే జాప్యం సైబర్ భద్రతను మరింత బలహీనపరుస్తున్నాయని వెల్లడైంది. సిస్కో రూపొందించిన ఈ నివేదిక కోసం ప్రపంచవ్యాప్తంగా 30 మార్కెట్లకు చెందిన 8,000 మంది సెక్యూరిటీ నిపుణులను సర్వే చేశారు. ఇందులో భారత్‌కు చెందిన 1,000 మంది నిపుణులు కూడా ఉన్నారు. సంస్థలు తమ డిజిటల్ వ్యవస్థలను ఎంత సమర్థంగా రక్షించుకుంటున్నాయి, సైబర్ ముప్పులను ఎంత వేగంగా గుర్తించి పరిష్కరిస్తున్నాయి.. అలాగే సైబర్ సెక్యూరిటీకి అడ్డంకులుగా మారుతున్న అంశాలు ఏంటనే విషయాలను అధ్యయనం చేశారు. సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయడంలో కేవలం టెక్నాలజీ లోపాలే ప్రధాన సమస్య కాదని నివేదిక వెల్లడించింది. సంస్థల్లో ఆమోద ప్రక్రియల్లో జాప్యం, విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం, డేటా వేర్వేరు చోట్ల ఉండటం వంటి అంతర్గత సమస్యలు కూడా సైబర్ రక్షణను బలహీనపరుస్తున్నాయని పేర్కొంది. భారత్‌లో కేవలం 40 శాతం మంది ప్రతినిధులు మాత్రమే సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్, ఐటీ విభాగాలు ఒకే బృందంలా సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.




# యూపీఐపై ఎండీఆర్ ప్రభావం..

దేశవ్యాప్తంగా కోట్లాది మంది రోజువారీ చెల్లింపులకు ఉపయోగిస్తున్న యూపీఐ వ్యవస్థలో అక్టోబర్ 15 నుంచి కీలక మార్పు రానుంది. రూ.2,000కు మించిన కొన్ని పర్సన్ టు మర్చంట్ (ౡ2వీ) చెల్లింపులపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) అమల్లోకి రానుంది. ఈ ఛార్జీని నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరాదని వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, దీనిపై దేశవ్యాప్తంగా వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 291 జిల్లాల్లో 67 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఓ వ్యాపారి అదనపు రుసుము వసూలు చేస్తే వినియోగదారులు ఏం చేస్తారనే సర్వే ప్రకారం.. 31,206 మందిలో కేవలం 14 శాతం మంది మాత్రమే అదనపు ఖర్చును భరించి యూపీఐని కొనసాగిస్తామని చెప్పారు. 27 శాతం మంది ఎండీఆర్ చెల్లించేందుకు సిద్ధంగా లేమని, బదులుగా నగదు చెల్లిస్తామని పేర్కొన్నారు. 26 శాతం మంది క్రెడిట్ కార్డును ఎంచుకుంటామని, 14 శాతం మంది డెబిట్ కార్డును ఉపయోగిస్తామని తెలిపారు. 4 శాతం మంది బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, చీజుఖీ లేదా ×వీూ వైపు వెళ్తామని వెల్లడించారు. 9 శాతం మంది అదనపు ఛార్జీ లేని మరో చెల్లింపు మార్గాన్ని అడుగుతామని చెప్పారు. 2 శాతం మంది కొనుగోలును వాయిదా వేస్తామన్నారు.

# డయాబెటిస్ ఉన్నవారు పండ్లను తినే విషయంలో ఈ సూచనలు పాటించాలి.. షుగర్ లెవల్స్ పెరగవు..



మధుమేహం ఉన్నవారు పండ్లలో సహజ చక్కెర ఉంటుందని వాటిని తినడానికి భయపడుతుంటారు. అయితే పండ్లలో కార్బోహైడ్రేట్లతోపాటు శరీరానికి అవసరమైన పోషకాలు, పీచు పదార్థం కూడా ఉంటాయి. ముఖ్యంగా పండ్లను రసం రూపంలో కాకుండా పూర్తిగా తినడం వల్ల అందులోని పీచు చక్కెర రక్తంలోకి వేగంగా చేరకుండా జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే ప్రమాదం తగ్గుతుంది. అయితే అన్ని పండ్ల ప్రభావం ఒకేలా ఉండదు. మధుమేహం ఉన్నవారు పండ్ల రకం, పరిమాణంపై శ్రద్ధ పెట్టడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**జామ పండు, బెర్రీలు..**

మధుమేహం ఉన్నవారికి జామపండు మంచి ఎంపికగా పేర్కొంటున్నారు. ఇందులో పీచు అధికంగా ఉండడంతోపాటు విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ వంటి బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, కరిగే పీచు అధికంగా ఉండి చక్కెర తక్కువగా ఉంటుంది. పియర్‌లో పీచు ఎక్కువగా ఉండడంతో రక్తంలోకి చక్కెర నెమ్మదిగా విడుదల కావడానికి సహాయపడుతుంది. యాపిల్‌ను తొక్కతో తినడం వల్ల పీచు, ఇతర పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. నారింజలో పీచు, విటమిన్ సి, పొటాషియం ఉంటాయి. అయితే నారింజ రసాన్ని తీసుకోవడం కంటే పండును పూర్తిగా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**కివి, బొప్పాయి..**

కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ, పొటాషియం, పీచు ఉంటాయి. పరిమితంగా తీసుకుంటే రక్తంలో చక్కెర నెమ్మదిగా పెరిగే అవకాశం ఉంటుంది. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, సహజ ఎంజైములు ఉంటాయి. అయితే సహజ చక్కెరలు ఉండడంతో పరిమాణంపై నియంత్రణ అవసరం. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము ఉన్నప్పటికీ ఇతర కొన్ని పండ్లతో పోలిస్తే సహజ చక్కెర ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవాలి. మామిడిపండులో సహజ చక్కెర, గ్లైసెమిక్ సూచీ ఎక్కువగా ఉండడంతో చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలని సూచిస్తున్నారు. ద్రాక్షను కూడా సులభంగా ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది కాబట్టి మధుమేహం ఉన్నవారు పరిమాణాన్ని నియంత్రించాలి.

**తాజా పండ్లను తినాలి..**

మధుమేహం ఉన్నవారు పండ్ల రసాలు లేదా ఎండబెట్టిన పండ్లకు బదులుగా తాజా పండ్లను పూర్తిగా తినడం మంచిది. ఒకేసారి ఎక్కువ పండ్లు తినకుండా చిన్న పరిమాణాల్లో తీసుకోవాలి. పండ్లను గింజలు, పెరుగు వంటి ప్రొటీన్ ఉన్న ఆహారంతో లేదా ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతాయి. బెర్రీలు, చెర్రీలు, యాపిల్ వంటి తక్కువ గ్లైసెమిక్ సూచీ కలిగిన పండ్లను ఎంచుకోవచ్చు. యాపిల్, పియర్ వంటి పండ్లను వీలైనంత వరకు తొక్కతో తినడం ద్వారా అదనపు పీచు లభిస్తుంది. ఏ పండు తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలో ఎలాంటి మార్పు వస్తుందో గమనించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. మధుమేహం ఉన్నవారు పండ్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని, సరైన పరిమాణంలో, జాగ్రత్తగా ఎంచుకుని తీసుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# రూ. 9లక్షల కోట్లు ఆవిరి..

## భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు..




దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,000 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ 50 సూచీ 22,300 స్థాయికి దిగువకు జారింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువలో దాదాపు రూ.9 లక్షల కోట్ల మేర తగ్గుదల కనిపించింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా బాండ్ రాబడులు పెరగడం, ముడి చమురు ధరలపై ఆందోళనలు మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి

విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు మరోసారి అమ్మకాల బాట పట్టడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. సెప్టెంబర్ 30న విదేశీ మదుపర్లు దాదాపు రూ.10,148 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇది గత ఆరు నెలల్లో ఒకే రోజులో నమోదైన అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఉపసంహరణ 2. అమెరికా బాండ్ రాబడుల పెరుగుదలఅమెరికా 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ సుమారు 5.3 శాతానికి చేరడం కూడా భారత మార్కెట్లపై ప్రభావం చూపింది. అమెరికా బాండ్లలో రాబడులు పెరిగినప్పుడు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో పెట్టుబడులపై ఆకర్షణ తగ్గుతంది. దీంతో విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి నిధులను వెనక్కి తీసుకుంటున్నారు.

3.ముడి చమురు ధరలపై ఆందోళనలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, సరఫరాకు సంబంధించిన ఆందోళనలు చమురు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముడి చమురు ధరలు పెరగడం భారత్‌పై తీవ్ర ఒత్తిడి కలిగిస్తాయి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, దిగుమతి వ్యయం, కంపెనీల లాభాలపై ప్రభావం పడుతుందనే ఆందోళన పెట్టుబడిదారుల్లో ఉంటుంది (ౡవఅంవఇ చీఅట్ఎ ఖీఖశ్రీశ్రీ).

4. అన్ని రంగాలకూ అమ్మకాల ఒత్తిడి

ఈ మార్కెట్ పతనం అన్ని రంగాలనూ దెబ్బతీసింది. ఆటో, మెటల్స్, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ తదితర రంగాల్లో కూడా భారీ అమ్మకాలు కనిపించాయి. నిఫ్టీ ఆటో సూచీ 4 శాతానికి పైగా పడిపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, టాటా స్టీల్ వంటి ప్రముఖ షేర్లు కూడా గణనీయంగా నష్టపోయాయి

# ప్రసవం తరువాత సాధారణ శరీరాకృతి వచ్చేందుకు ఎంత సమయం పడుతుంది..



ప్రసవం తర్వాత మహిళలు త్వరగా గర్భధారణకు ముందు ఉన్న శరీరాకృతికి తిరిగి రావాలనే ఒత్తిడి ఇటీవలి కాలంలో పెరిగింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ప్రముఖుల శరీర మార్పులను ఆధారంగా చేసుకుని కొత్తగా తల్లైన మహిళలపై అంచనాలు పెడుతున్నారు. అయితే గర్భధారణ, ప్రసవం తర్వాత శరీరంలో గణనీయమైన హార్మోన్ల, శారీరక మార్పులు చోటుచేసుకుంటాయి. అందువల్ల వెంటనే మునుపటి శరీరాకృతికి తిరిగి రావడం సాధ్యం కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. గర్భధారణకు ముందు ఉన్న బరువుకు చేరుకోవడానికి కనీసం ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పడుతుందని, ప్రతి మహిళ శరీరం, కోలుకునే విధానం భిన్నంగా ఉంటాయని వివరిస్తున్నారు.

**తొలి 6 వారాలు కీలకం..**

ప్రసవం తర్వాత తొలి ఆరు వారాలు లేదా సుమారు 40 రోజులను కీలకమైన కోలుకునే దశగా పరిగణిస్తారు. ఈ సమయంలో హార్మోన్లలో మార్పులు, పాలిచ్చే ప్రక్రియ, ప్రసవం వల్ల శరీరంలో చోటుచేసుకున్న మార్పులకు శరీరం క్రమంగా అలవాటు పడుతుంది. గర్భధారణ సమయంలో పెద్దదైన గర్భాశయం మళ్లీ సాధారణ పరిమాణానికి చేరుకోవడానికి కూడా సమయం పడుతుంది. అదే సమయంలో పొత్తికడుపు కండరాలు, పెల్విక్ ఫ్లోర్ కండరాలు సడలిపోతాయి. బిడ్డ పెరుగుతున్న కొద్దీ పొత్తికడుపు కండరాలు సాగిపోవడం, పెల్విక్ ఫ్లోర్ కండరాల బలం తగ్గడం జరుగుతుంది. అందువల్ల ప్రసవం తర్వాత కూడా పొట్టలో ఇంకా బిడ్డ ఉన్నట్లుగా అనిపించడం సహజమేనని నిపుణులు చెబుతున్నారు.

**ప్రసవం వెంటనే బరువులో మార్పు..**

ప్రసవం జరిగిన వెంటనే కొంత బరువు తగ్గడం సహజంగా జరుగుతుంది. బిడ్డ బరువు, మాయ, గర్భంలో ఉన్న ద్రవం, శరీరంలో నిల్వ ఉన్న అదనపు ద్రవాలు తగ్గడం వల్ల సుమారు ఐదు కిలోల వరకు బరువు తగ్గే అవకాశం ఉంటుంది.

## మహిళల్లో కనిపించే వైట్ డిశ్చార్జ్ వంటి సమస్యలకు కారణాలేంటి.. ఇవి హానికరమా..?



మహిళల్లో యోని నుంచి తెల్లని లేదా ఇతర రకాల స్రావాలు రావడం సాధారణమైన శారీరక ప్రక్రియలో భాగమేనని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే దీనిని చాలామంది మహిళలు అనారోగ్యానికి సంకేతంగా భావించి ఆందోళన చెందుతుంటారు. వాస్తవానికి రుతుచక్రంలో హార్మోన్ల స్థాయిల్లో వచ్చే మార్పుల కారణంగా గర్భాశయ ముఖద్వారం నుంచి విడుదలయ్యే శ్లేష్మం పరిమాణం, రంగు, స్వభావంలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పులను గమనించడం ద్వారా మహిళలు తమ శరీరంలో జరుగుతున్న సహజ మార్పులను మరింతగా అర్థం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ూ× అఅ ంజూశీతీం జఊఽవశీ
2ూ× అఅ
ంజూశీతీం
జఊఽవశీ
2

ఈస్ట్రోజెన్ స్థాయిలు తక్కువగా ఉంటే..రుతుచక్రం ప్రారంభ దశలో యోని పొడిగా అనిపిస్తుంది లేదా శ్లేష్మం చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తక్కువగా ఉండడంతో గర్భాశయ ముఖద్వారం మూసి ఉంటుంది. ఆ తర్వాత ఈస్ట్రోజెన్ స్థాయిలు పెరగడం ప్రారంభించినప్పుడు స్రావం మందంగా, జిగటగా మారుతుంది. అనంతరం లోషన్‌లా క్రీమీలాంటి స్రావం కనిపిస్తుంది. మరికొంత సమయం తర్వాత అది మరింత తడిగా, జారుడుగా మారుతుంది. సాధారణంగా అండోత్సర్గానికి ముందు ఈస్ట్రోజెన్ స్థాయిలు అత్యధికంగా ఉన్నప్పుడు స్రావం పారదర్శకంగా, సాగే స్వభావంతో పచ్చి గుడ్డులోని తెల్లసొనలా కనిపిస్తుందని నిపుణులు వివరిస్తున్నారు.

**రుతుచక్రాన్ని బట్టి మారుతుంది..**

సాధారణంగా 28 రోజుల రుతుచక్రం ఉన్న మహిళల్లో 11 నుంచి 15వ రోజుల మధ్య పారదర్శకంగా, సాగే స్వభావం కలిగిన గర్భాశయ ముఖద్వార శ్లేష్మం కనిపించే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి మహిళలో సమయం ఒకేలా ఉండదు.



## రక్తపోటు సమస్య ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. గుండెను ఎలా రక్షించుకోవాలి..

అధిక రక్తపోటు సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్య అయినప్పటికీ, దాన్ని నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినడం, చూపు కోల్పోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతోపాటు అవసరమైతే వైద్యుల సూచన మేరకు మందులు వాడడం, క్రమం తప్పకుండా రక్తపోటును పర్యవేక్షించడం కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఆహారం, నిద్ర, ఒత్తిడి, శారీరక చలనం, శరీర బరువు, వయసు, కుటుంబంలో అధిక రక్తపోటు చరిత్ర వంటి అనేక అంశాలు రక్తపోటుపై ప్రభావం చూపుతాయని వారు సూచిస్తున్నారు.

**ఉప్పును తగ్గించాలి..**

రక్తపోటును ఆరోగ్యకరంగా ఉంచడంలో ఉప్పు, సోడియం తీసుకునే పరిమాణాన్ని తగ్గించడం ముఖ్యమైన చర్యల్లో ఒకటి. ప్యాకేజ్డ్ ఆహారాలు, అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు, చిప్స్ వంటి ఉప్పు ఎక్కువగా ఉండే చిరుతిళ్లు, ప్రాసెస్ చేసిన మాంసాహారం, తయారుగా లభించే సాస్‌లు, రెడీమేడ్ ఆహారాలను పరిమితం చేయడం మంచిది. వీటికి బదులుగా తాజా, సహజమైన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పొటాషియం, పీచు అధికంగా ఉండే ఆలుగడ్డలు, చిలగడదుంపలు, చేర్చుకోవడం రక్తపోటు నియంత్రణకు తోడ్పడతాయి.



## మాది వైజాగ్.. స్కూల్ టైంలోనే హీరోయిన్ అవుతానని చెప్పానటా

పెద్దయ్యాక ఏమవుతావని చిన్నప్పుడు మా స్కూల్ టీచర్ అడిగితే 'హీరోయిన్' అని చెప్పానట. అప్పటి నుంచి నా ఇష్టాన్ని మా వాళ్లు ప్రోత్సహించారు. 'తత్వం'లో నటించడం ఆనందంగా ఉంది' అని నాయిక దష్వికఅన్నారు. దినేష్ తేజ్

హీరోగా నటించిన ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. శీమకుర్తి వంశీకృష్ణ, శ్వేత పసుపులేటి నిర్మాతలు. ఈ చిత్రం అక్టోబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా దష్విక విలేకరులతో మాట్లాడుతూ 'మాది వైజాగ్. మోడలింగ్ చేశాను. ఆ క్రమంలోనే విజయ్ దేవరకొండతో కలిసి ఓ యాడ్‌లో నటించాను. 'తత్వం'లో నటనకు స్కోప్ ఉన్న రోల్ చేశాను. మర్డర్ మిస్టరీ సస్పెన్స్‌తో ఈ సినిమా సాగుతుంది. తొలి సినిమాకు నన్ను అందరూ సపోర్ట్ చేసిన తీరు ఇండస్ట్రీ మీద కాన్ఫిడెన్స్ పెంచింది. మా దర్శకుడు సాఫ్ట్‌వేర్ జాబ్‌కి సెలవు పెట్టి ఈ సినిమా చేశారు. తప్పకుండా అందరికీ నచ్చేలా తీర్చిదిద్దారు' అని అన్నారు. తెలుగు, తమిళంలో కొత్త ప్రాజెక్టులు త్వరలోనే మొదలవుతాయని తెలిపారు.

## రవితేజ కొత్త మూవీకి ఇంట్రెస్టింగ్ టైటిల్!



మాస్ మహారాజా రవితేజఈ పేరు వింటేనే థియేటర్లలో విజిళ్లు, ఈలలు సంబరాలు గుర్తుకొస్తాయి. ఇటీవల వచ్చిన 'ఇరుముడి' సినిమాతో బాక్సాఫీస్ దగ్గర రవితేజ చూపించిన రచ్చ అంతా ఇంతా కాదు. శివ నిర్వాణ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 250 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, రవితేజ కెరీర్‌లోనే హైయెస్ట్ కలెక్టింగ్ మూవీగా నిలిచింది.?గతంలో వచ్చిన కొన్ని ఫ్లాప్స్‌తో కాస్త ఇబ్బంది పడిన మాస్ రాజా, 'ఇరుమూడి' గ్రాండ్ సక్సెస్‌తో మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చేశారు. ఈ రేంజ్ విజయం రావడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌లపై అభిమానుల్లోనూ, ఇండస్ట్రీ వర్గాల్లోనూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి .ప్రస్తుతం రవితేజ లైనప్‌లో వరుసగా యువ దర్శకుల సినిమాలు ఉన్నాయి. అందులో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న మోస్ట్ క్రేజీ కాంబినేషన్.. దర్శకుడు వివేక్ ఆత్రేయ తో చేయబోయే ప్రాజెక్ట్.?'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా', 'అంటే సుందరానికి', 'సరిపోదా శనివారం' సినిమాలతో తనకంటూ ఒక సెపరేట్ మార్క్ క్రియేట్ చేసుకున్నాడు వివేక్ ఆత్రేయ. విభిన్నమైన టేకింగ్‌తో ప్రశంసలు అందుకునే వివేక్ ఆత్రేయ, ఈసారి మాస్ రాజా కోసం ఓ సరికొత్త కథను సిద్ధం చేశారు.?విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ సినిమా ఒక ఊహించని 'హారర్ కామెడీ థ్రిల్లర్' జానర్‌లో రాబోతోందట. రవితేజ మార్క్ కల్ట్ కామెడీ టైమింగ్, ఆయన మాస్ ఎనర్జీకి.. వివేక్ ఆత్రేయ మార్క్ స్క్రీన్ ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద పూనకాలే అని చెప్పొచ్చు.ఇక ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్ నగర్‌లో ఓ ఆసక్తికరమైన వార్త తెగ చక్కర్లు కొడుతోంది. ఈ హారర్ ఎంటర్‌టైనర్‌కి మేకర్స్ తులా భారం (ఽష్ట్రబశ్రీఖఎష్ట్రుతీఖఎ) అనే క్యాచీ టైటిల్‌ను ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది.?ఈ టైటిల్ వినడానికి చాలా డిఫరెంట్‌గా, ఆసక్తికరంగా ఉంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.?ఇప్పటికే దర్శకుడు వివేక్ ఆత్రేయ ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌ను కూడా పూర్తిగా పూర్తి చేసినట్టు తెలుస్తోంది.కథ, కథనంపై ఫుల్ క్లారిటీతో ఉన్న దర్శకుడు.. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేం దుకు సన్నాహాలు చేస్తున్నారట. అన్నీ అనుకున్నట్టు జరిగితే.. రాబోయే దసరా పండుగ శుభ ముహూర్తాన ఈ సినిమా షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారని ఇండస్ట్రీ టాక్.?

రవితేజ లాంటి మాస్ హీరో ఒక పక్కా హారర్ కామెడీ థ్రిల్లర్ చేస్తే ఎలా ఉంటుంది? వివేక్ ఆత్రేయ ఆయనను ఏ రేంజ్‌లో ప్రజెంట్ చేయబోతున్నారు? అనే ప్రశ్నలే ఇప్పుడు ఫ్యాన్స్‌లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచుతున్నాయి. రూ. 250 కోట్ల 'ఇరుమూడి' విజయం తర్వాత రాబోతున్న ఈ 'తులా భారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

## ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ 'సర్దార్ 2'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!




కార్తీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'సర్దార్ 2' ఎట్టకేలకు డిజిటల్ మాధ్యమంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో (ూ�మిఖఓశీఅ ౖాతీఱఎవ ఎఱఎవశీ) లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ రెండవ భాగంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విడుదలై నెగిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయాన్ని అందుకుంది. ఇక దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరో కార్తీ మరోసారి ద్విపాత్రాభినయంతో అదరగొట్టారు. ఇక ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ పాత్రలో కనిపించగా, మాళవిక మోహనన్ ఆషికా రంగనాథ్ రజీషా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.




## యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల.. నవ్వులు పంచుతూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హర్రర్-కామెడీ!

బాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా హర్రర్-కామెడీ 'నైయ్ నవెల్లి' తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలీవుడ్ హీరోయిన్ యామి గౌతమ్ ధర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఇక ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినీ వర్గాల్లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలో యామి గౌతమ్ సరసన ఆదినాథ్ కోఠారేతదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ మరియు అమెజాన్ ఎంజిఎం స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది.

ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. ఎంతో అస్తవ్యస్తంగా, గందరగోళంగా ఉన్న ఒక సాధారణ కుటుంబంలోకి యామి గౌతమ్ కొత్త కోడలిగా ప్రవేశించడంతో కథ అసలు మలుపు తిరుగుతుంది. ఆమె ఇంట్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆ కుటుంబంలోని అందరి జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చి, ప్రశాంతత చేకూరుతుంది. కలుగుతుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కోడలు నిజంగానే ఆ కుటుంబానికి దేవతలాంటి మనిషా లేక ఆమె వెనుక మరేదైనా దెయ్యం లేదా అంతుచిక్కని రహస్యం దాగుందా అనే కోణంలో ఈ ట్రైలర్ చాలా ఉత్కంఠభరితంగా, నవ్వులు పూయిస్తూనే వెన్నులో వణుకు పుట్టించేలా సాగుతుంది.

## ముంబైకి మకాం మార్చిన కల్యాణి ప్రియదర్శన్



దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును సంపాదించుకుంది కల్యాణి ప్రియదర్శన్. ముఖ్యంగా గత ఏడాది విడుదలైన 'లోక ఛాప్టర్-1' చిత్రం ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ నేపథ్యంలో ఆమె 'ప్రళయ్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో జాంబీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూనే రణ్‌వీర్‌సింగ్ సరసన నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకోవడంతో ఈ సొగసరి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఆమె లుక్, ఫిట్‌నెస్, యాక్షన్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నది. అందులో భాగంగా ముంబయికి మకాం మార్చి సినిమా పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుందట. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాల కోసం గత మూడు నెలలుగా స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదట. రణ్‌వీర్‌సింగ్‌తో కలిసి వర్క్‌షాప్స్, రిహార్సల్స్‌లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నదీ భామ. ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో బ్రేక్ సాధించి ఉత్తరాదిన కూడా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో కల్యాణి ప్రియదర్శన్